స్వచ్ఛత ఎక్కడ..!

- నిడదవోలులో సులభ్ కాంప్లెక్స్‌లు లేక ప్రజలు అవస్థలు
- దూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు నరకయాతన
- మున్సిపాలిటీ తీరుపై సర్వత్రా విమర్శలు



పట్టణంలో రద్దీగా ఉన్న గణపతి జంక్షన్

నిడదవోలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛభారత్‌ను నిర్మించాలంటున్నాయి. దాని కోసం పలు కార్యక్రమాలు కూడా అమలు చేస్తున్నాయి. కానీ ఎక్కడా అది కనిపించడంలేదు. కొన్ని పట్టణ ప్రాంతాల్లో కనీసం మరుగుదొడ్లు లేని పరిస్థితులు నెలకొన్నాయి. వివిధ పనులపై పట్టణాలకు వచ్చే ప్రజలు టాయిలెట్లు లేక ఇబ్బంది పడుతున్నారు. మహిళలు అత్యవసరమైతే దూర ప్రాంతాలకు ఆరుబయటకే వెళ్లాల్సి వస్తోంది. నిడదవోలు పట్టణంలో కనీసం సులబ్ కాంప్లెక్స్‌ల లేకపోవడం దారుణమని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

నిత్యం ప్రయాణికులతో రద్దీ

పట్టణంలో ప్రధానంగా పాటిమీద సెంటర్, గణపతి సెంటర్, బస్టాండ్ సెంటర్, రైల్వే స్టేషన్ సెంటర్, గూడెం రైల్వే గేటు సెంటర్, స్థానిక ఓవర్ బ్రిడ్జి సెంటర్లలో నిత్యం నిడదవోలు మండలంలో ఉన్న 23 గ్రామాలకు చెందిన ప్రజలతో పాటు చాగల్లు మండలం నుంచి వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత మంది వచ్చే ఈ చోట కనీసం మరగుదొడ్లు కూడా లేకపోవడంతో ఎక్కడికక్కడే మూత్రవిసర్జన చేయడంతో దుర్గంధ వెదజల్లుతోంది. అంతా అపరిశుభ్రత నెలకొనడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

తప్పని అవస్థలు

పట్టణంలో 30 పడకల ప్రభుత్వాసుపత్రి, సుమారు 10 ప్రైవేట్ ఆసుపత్రులు, తహసీల్దారు,రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, ఆర్అండ్‌బీ అతిథి గృహం, పెద్ద పోష్టాఫీసు, పోలీస్ స్టేషన్, వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు నిత్యం వేలాది మంది ప్రజలు తమ అవసరాల కోసం వస్తుంటారు. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలలకు వివిధ గ్రామాల నుంచి సుమారు 5వేలకు పైగా విద్యార్థులు వస్తున్నారు. కళాశాలలు, పాఠశాలల ముగియగానే విద్యార్థులు బస్సుల కోసం వివిధ సెంటర్లలో గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. ఆ సమయంలో వారి అవసరాలు తీర్చే మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారపు సంత మార్కెట్‌లో కూడా ఒక్క మరుగుదొడ్డి కూడా లేకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. పట్టణానికి వివిధ పనుల కోసం వచ్చేవారంతా బ్రాహ్మణగూడెం వెళ్లే రహదారి, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద బహిరంగ ప్రదేశాల్లో మగవారు కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. పట్టణంలో రైల్వేగేటు దాటుకుని పశ్చిమడెల్టా ప్రధాన కాలువ గట్టున మల,మూత్ర విసర్జన చేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా సులభ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.



నిడదవోలు పట్టణం

టాయిలెట్లకు స్థలం కేటాయిస్తాం



పట్టణంలో పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాలకు ఎవరైనా ముందుకు వస్తే మున్సిపల్ స్థలం కేటాయిస్తాం. గతంలో వివిధ సంస్థలు మరుగుదొడ్ల నిర్మాణానికి ముందుకు వచ్చాయి. ప్రధాన సెంటర్లలో మున్సిపాలిటీకి చెందిన స్థలాలు కేటాయిస్తాం. పట్టణంలో ఓవర్‌బ్రిడ్జి సెంటర్, గణపతి జంక్షన్, బస్టాండ్ సెంటర్లలో పబ్లిక్ టాయిలెట్లు కట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం

– సామవేదం హేమంత్, మున్సిపల్ ఏఈఈ, నిడదవోలు

చెస్‌లో తపస్వీరెడ్డి ప్రతిభ



విద్యార్థి తపస్వీరెడ్డికి సర్టిఫికెట్, మెమెంటో అందిస్తున్న నిర్వాహకులు

నిడదవోలు : ఏపీ రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ 2024 పోటీలలో నిడదవోలు పట్టణానికి చెందిన కుంచాల తపస్వీరెడ్డి అండర్–11 విభాగంలో చక్కటి ప్రతిభ కనబరిచి 5వ స్థానంలో నిలిచాడు. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఎంఏఎం ఫార్మసీ కళాశాలలో నల్లూరి న్యూరో అండ్ స్కిన్ హాస్పిటల్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఏపీ చెస్ ఓపెన్ టోర్నమెంట్ –2024లో తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణానికి చెందిన తపస్విరెడ్డి అండర్ –11 బాలుర విభాగంలో ఐదో బహుమతి కైవసం చేసుకున్నాడు. ఈ పోటీలో మూడు వందల మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపస్వీరెడ్డిని నారాయణ పాఠశాల ఆర్ఐ బి.సురేష్, ఏఓ బి.నాగేంద్ర, ఉపాధ్యాయులు, పట్టణ ప్రముఖులు అభినందించారు.

క్లుప్తంగా

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం సీజ్



తాళ్లపూడి పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న వ్యాన్

తాళ్లపూడి: పోలవరం నుంచి వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని తాళ్లపూడి పోలీసులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. స్థానిక ఎస్సై టి.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రాత్రి సమయంలో డ్రంక్‌అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న సమయంలో పోలవరం నుంచి బొలేరో వ్యాన్‌లో తరలిస్తున్న 30 బస్తాలు (15 కింటాళ్ల) రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ చోడిపిండి ఆదివిష్ణును అరెస్టు చేసి బియ్యాన్ని, వ్యాన్‌ను సీజ్ చేశారు. సివిల్ సప్లయ్ అధికారులు కూడా కేసు నమోదు చేశారు.

తహసీల్దార్‌గా రవీంద్రనాథ్ బాధ్యతల స్వీకరణ



రవీంద్రనాథ్

తాళ్లపూడి: స్థానిక మండల తహసీల్దార్‌గా బి.రవీంద్రనాథ్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరం మండలం నుంచి ఆయన ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ భారతి, మండల ఏఎస్‌వో జె.వెంకటేశ్వరరావు, ఇతర కార్యాలయ సిబ్బంది రవీంద్రనాథ్‌కు పుష్పగుచ్ఛం స్వాగతం పలికారు.

చాగల్లు తహసీల్దార్‌కు శుభాకాంక్షలు



తహసీల్దార్ మెరికమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న రేషన్‌డీలర్లు

చాగల్లు: స్థానిక తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం.మెరికమ్మను సోమవారం పలువురు కలిసి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మండల రేషన్ డీలర్లు సంఘం ఆధ్వర్యంలో డీలర్లు కలిసి ఆమెకు పుష్పగచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఎస్ డీటీ కె.సునీత, డీలర్లు కె.గణేష్, ఎ.సత్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. టీడీపీ చాగల్లు మండల ఎస్సీ సెల్ నాయకులు సోమవారం కలిశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యతలు స్వీకరించిన మెరికమ్మను పార్టీ శ్రేణులు కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ కార్యక్రమంలో బి.సుదీర్, జె.ఆనంద్ బాబు, ఎం.ఆకాష్, బి.బన్ను,ఎస్.రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ నరేష్ కుమార్‌కు వీడ్కోలు



ఎంపీడీఓ నరేష్‌కుమార్‌కు వీడ్కోలు పలుకుతున్న ఉద్యోగులు

నల్లజర్ల: ఎన్నికల సమయంలో ఎంపీడీఓగా నియమితులైన నరేష్‌కుమార్ తిరిగి వెళుతున్న సందర్భంగా సోమవారం పలువురు ఉద్యోగులు ఆయనకు వీడ్కోలు పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని కాపాడే వైద్య, ఆరోగ్య శాఖ ఎల్లప్పుడు ముందంజలో ఉండాలన్నారు. నల్లజర్ల పీహెచ్‌సీ ఉద్యోగులు టీంగా ఏర్పడి అనేక జాతీయ కార్యక్రమాలు విజయవంతంగా చేశారన్నారు. ఆయనను అభినందించిన వారిలో డాక్టరు గంగాధరరావు, డాక్టరు సిరాజుద్దీన్, సీహెచ్‌ఓ ప్రసాదరావు, వైద్య ఉద్యోగుల సంఘ నాయకులు జీవీవీ ప్రసాద్ ఉన్నారు.

వర్గీకరణ వద్దు.. ఐక్యతే ముద్దు..



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

గోపాలపురం: గ్రామంలో వర్గీకరణ వద్దు ఐక్యతే ముద్ద అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీగా వచ్చిన మాల సంఘాల నాయకులు సోమవారం తహసీల్దార్ బి.ప్రదీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇప్పటివరకూ కలసి మెలసి ఉన్న మాదిగ, మాలలను వర్గీకరణ పేరుతో సుప్రీంకోర్టు విడదీయడం సమంజసం కాదని ఐక్యతగా ఉంటే రాజ్యాధికారం సాధ్యమవుతుందని మాల సంఘాల నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని మాల సంఘాలు, అంబేడ్కర్ వాదులు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగ ఉపాధ్యాయులను మినహాయించాలి



దేవరపల్లిలో ఎంఈఓ తిరుమలదాస్‌కు వినపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతలు

దేవరపల్లి: పాఠశాల విద్య–పని సర్దుబాటు ప్రక్రియకు ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోకి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య నేతలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఫ్యాప్టో పిలుపు మేరకు సోమవారం ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల విద్యాశాఖ అధికారులు ఎం.తిరుమలదాస్, కేఆర్‌ఏస్‌వీవీ అప్పారావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య మండల అధ్యక్షులు ఎల్.రామారావు, బర్ణికల నాగేంద్రప్రసాద్, పులపాకల గంగరాజు, ఓరుగుంటి శివనాగప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల్లో పని సర్దుబాటును ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రక్రియలో 70 శాతం పైబడి దివ్యాంగ ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. మండల, డివిజన్ స్థాయికే ప్రక్రియను పరిమితం చేయాలన్నారు. ఈ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాల నేతలతో ప్రభుత్వం చర్చించి వారి అంగీకారం మేరకు ప్రక్రియ ముందుకు వెళుతుందని, అప్పటి వరకు ప్రక్రియను జరగనివ్వమని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రతినిధి ఎం.ఎస్. మహాలక్ష్మి, మాధవరపు నాగేశ్వరరావు, కొమారపు ఉమాకాంత్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ సర్పంచులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకరరావు

దేవరపల్లి: గ్రామ పంచాయతీల సర్పంచులకు పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించి, నైపుణ్యతను పెంపొందించడానికి ప్రభుత్వం సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ప్రభాకరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం శిక్షణ నిర్వహించారు. ఎంపీడీఓ ప్రభాకరరావు మాట్లాడుతూ శిక్షణ తరగతులు మూడు రోజులు జరుగుతాయన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, వేస్ట్ మేనేజ్‌మెంట్, గ్రామ అభివృద్ధి ప్రణాళికల పరిశీలన విధానం, పంచాయతీ పాలకవర్గ సమావేశాల నిర్వహణ, వీధిలైట్లు, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. జి.కమలావతి, యు.శివ, హరిబాబు, సీహెచ్ జగ్జీవన్ శిక్షణ ఇచ్చారు.

పంచాయతీలకు ఆదాయాన్ని పెంచేలా..

నిడదవోలు రూరల్: గ్రామ పంచాయతీలకు ఆదాయాన్ని పెంచేందుకు పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గాలు కృషి చేయాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ సూచించారు. సమిశ్రగూడెం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు మూడు రోజులు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.రత్నమాలిక, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణ

కొవ్వూరు: గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై పంచాయతీ కార్యదర్శులకు, సర్పంచులకు శిక్షణ తరగతలను నిర్వహిస్తున్నారు. సోమవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి.మూడు రోజులపాటు జరిగే ఈ శిక్షణను ఎంపీపీ కాకర్ల సత్యనారాయణ(నారాయుడు)ప్రారంభించారు. ఎంపీడీవో కె.సుశీల, ఈవోపీఆర్ ఆర్‌డీ శర్మ తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ



సమావేశంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

కొవ్వూరు: యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ సూచించారు. పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వ్యసనాలను బానిసలు కావడం వల్ల విద్యార్థుల జీవితాలతోపాటు వారి కుటుంబాలు వీధి పడతాయని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన ప్రతిజ్ఞ చేయించారు. సీడీపీవో డి.మమ్మి, పట్టణ సీఐ పి.విశ్వం, కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి సతీష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం నాశనం



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్ మేరీసుజాత

నిడదవోలు : మత్తు పదార్థాలు తీసుకోవడంవల్ల జీవితం నాశనమవుతుందని, వాటికి దూరంగా ఉండాలని ప్రిన్సిపాల్ బి.మేరీసుజాత అన్నారు. కేంద్ర సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సోమవారం మత్తు పదార్థాల వినియోగం– అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మేరి సుజాత మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల నుంచి విముక్తి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయన్నారు. కళాశాల విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కాకూడదని హెచ్చరించి, అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.హరీష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి బి.యేసురత్నం, అధ్యాపకులు రామ్మోహన్‌రావు, వెంకటరమణ, సురేష్‌కుమార్, కుమార్ స్వామి, బాలకృష్ణ, మురళి, సతీష్, సుధీర్, వీర్రాజు విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

నిడదవోలు: ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఏవిధంగా మనకు ఉపయోగపడుతుంది అనే అంశంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ఏఎస్ విశ్వనాథ్, ఎస్‌కే జామీల, లోక్ అదాలత్ మెంబర్ ఎం. వెంకటేశ్వరరావు, న్యాయవాదులు సీహెచ్ విజయ్‌కుమార్, హెచ్‌ఎం చెరుకూరి పద్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ–పంట నమోదు వేగవంతం చేయాలి

నిడదవోలు రూరల్: ఈ–పంట నమోదును త్వరిత గతిన పూర్తిచేయాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ ఆదేశించారు. ఈ–పంట నమోదు ప్రక్రియపై సమిశ్రగూడెంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు సాగు చేస్తున్న పంట వివరాలు నమోదుతోనే పంట సాయం, పంటల బీమా తదితర ప్రభుత్వ పథకాలు అందజేసేందుకు వీలవుతుందన్నారు. రైతులు ఏ పంట సాగుచేస్తే ఆ పంటనే నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు, పలువురు రైతులు పాల్గొన్నారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



సమిశ్రగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



దేవరపల్లిలో జాతీయ పతాకాలతో ప్రదర్శన చేస్తున్న ఎంపీపీ దుర్గారావు, అధికారులు

నిడదవోలు రూరల్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై త్రివర్ణ జెండాను ఎగురువేసి దేశభక్తిని చాటాలని ఎంపీడీఓ జేఏ ఝాన్సీ పిలుపునిచ్చారు. సోమవారం సమిశ్రగూడెం గ్రామంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం సాగించిన పోరాటంలో ఎందరో అమరులయ్యారని తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని యువత జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. యువతలో జాతీయుతను పెంపొందించే లక్ష్యంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఎస్.రత్నమాలిక, కార్యాలయ ఏఓ రత్నరాజు, పంచాయతీ కార్యదర్శులు ప్రకాశరావు, టి.గోపాలకృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జాతీయ పతాకాలతో ప్రదర్శన

దేవరపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం దేవరపల్లిలో జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ప్రదర్శన సాగింది. ఎంపీపీ కేవీకే దుర్గారావు, ఎంపీడీఓ ప్రభాకరరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

పిల్లలతో పని చేయిస్తే చర్యలు



కేసులు నమోదు చేసిన లేబర్, పోలీసు అధికారులు

నల్లజర్ల: చిన్నారులను పనిలో చేర్చుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నిడదవోలు అసిస్టెంట్ లేబర్ అధికారి(ఏ.ఎల్.ఓ)పి.శాంతిరాజు అన్నారు. కలెక్టరు ఆదేశాల మేరకు నల్లజర్లలో సోమవారం స్పెషల్‌టీం(రాజమహేంద్రవరం లేబర్ అధికారులు, పోలీసు సిబ్బంది) విస్తృత తనిఖీలు నిర్వహించింది. బైక్ మెకానిక్ షాపు వద్ద పని చేస్తున్న బాలుడు, కుసుమ ట్రేడర్స్ వద్ద పని చేస్తున్న బాలిక, మగ్గం వర్క్స్ వద్ద పనిచేస్తున్న బాలుడిని బాలకార్మికులుగా గుర్తించి కేసులు నమోదు చేశారు. వారిని చదువుకోవాలని సూచించారు. నెలరోజుల పాటు జిల్లాలో స్పెషల్‌డ్రైవ్ ఉంటుందని తెలిపారు. 18ఏళ్ల లోపు వారిని పనిలో పెట్టుకోవద్దని తెలిపారు. ఈ దాడులలో ఎస్ఐ వాణి, కానిస్టేబుల్ ఆలీ పాల్గొన్నారు.

గ్రామాల్లోనూ ఆగని టీడీపీ ఆగడాలు

పంచాయతీకి చెందిన వేపచెట్టు అక్రమంగా నరికివేత



వేపచెట్టును నరికివేసిన దృశ్యం

గోపాలపురం: గ్రామాల్లో టీడీపీ నాయకుల ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి. ఇప్పటి వరకూ చిట్యాలలో వైఎస్సార్ సీపీకి చెందిన నాయకుడి ఇంటిని కూల్చడానికి ప్రయత్నించారు. సోమవారం గోపాలపురం మండలం గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెం మంచినీటి ట్యాంకు వద్ద ఉన్న సుమారు 40ఏళ్ల వయసు గల వేపచెట్టును నరికివేసి, అక్రమంగా తరలించారు. దీని విలువ సుమారు రూ.లక్ష పైనే ఉంటుందని గంగోలు వైఎస్సార్ సీపీ నాయకులు ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని వైఎస్సార్ సీపీ నాయకులు పేర్కొన్నారు.

కొనసాగుతున్న చెట్టు పునరుద్ధరణ పనులు



కుమారదేవంలో జరుగుతున్న చెట్టు పునరుద్ధరణ పనులు

కొవ్వూరు: కుమారదేవంలో కూలిన భారీ నిద్రగన్నేరు చెట్టు పునరుద్ధరణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత రెండు రోజుల నుంచి చెట్టుకు బరువుగా ఉన్న కొమ్మలను కత్తిరించారు. ఈ పనులను రోటరీక్లబ్ ఇన్‌చార్జి రేఖపల్లి దుర్గాప్రసాద్ పర్యవేక్షణలో భారీ క్రేన్, జేసీబీ సహకారంతో చేస్తున్నారు. సోమవారం కొమ్మలను వేరు చేసి ఎలాంటి నష్టం లేకుండా ఉండేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన లేపనాలు పూశారు. ఈ ప్రక్రియ మరో నాలుగైదు రోజులు సమయం పడుతుందన్నారు. ఈ చెట్టు ప్రాముఖ్యత గురించి మీడియాలో వరుస కథనాలు రావడంతో చెట్టు ఒక్కసారిగా ప్రాచుర్యంలోకి వచ్చింది. స్థానికులంతా నిరంతరం ఇక్కడి విచ్చేసి పనులు పరిశీలిస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు సైతం వచ్చి చూస్తున్నారు.

రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని లేఖలు

కొవ్వూరు: కరోనా విపత్తుకి ముందు కొవ్వూరు రైల్వే స్టేషన్‌లో నిలిపివేసిన ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులను పునరుద్ధరించాలని రైల్వే స్టేషన్ పరిరక్షణ సమితి కోరింది. ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఉత్తరాల ఉద్యమం కొనసాగుతుంది. సోమవారం సద్గురు పాఠశాల విద్యార్థులతో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరుతూ లేఖలు రాశారు. పడాల సుబ్బారెడ్డి, వీటీ విల్సన్, కేవీ రమణ, వైకే శ్రీనివాస్, కొండపల్లి రత్నసాయి తదితరులు పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ కంఠమణి కీర్తీ సమితి చేస్తున్న కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందజేసినట్లు రైల్వే పరిరక్షణ సమితి సభ్యులు తెలిపారు.

గ్రంథాలయ ఉద్యమ నేత రంగనాథన్‌కు నివాళి

ఉండ్రాజవరం: గ్రంథాలయ ఉద్యమంలో అయ్యంకి వెంకటరమణయ్య తర్వాత ఆ స్థాయిలో పని చేసిన ఎస్ఆర్ రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రానికి గుర్తింపు, రూపు రేఖలు తీసుకువచ్చారని విశ్రాంత ఆంగ్ల భాష అధ్యాపకులు కోట రామప్రసాద్ అన్నారు. గ్రంథాలయ ఉద్యమ పితామహులు ఎస్ఆర్ రంగనాథన్ జయంతిని ఉండ్రాజవరం శాఖ గ్రంథాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథపాలకుడు గుత్తికోండ కృష్ణారావు మాట్లాడుతూ గ్రంథాలయ శాస్త్రం అభివృద్ధికి రంగనాథన్ ఎంతో కృషి చేసారని చెప్పారు. గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. ముందుగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠకులు ఎంవీ కృష్ణారావు, పి.సత్యనారాయణ మూర్తి, జి.సురేష్, వి.చంద్రరావు, బి.అనిల్ శల్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.